సాక్షి
యాదాద్రి భువనగిరి
శనివారం । 4 । అక్టోబర్ । 2025



రైతు సంక్షేమమే లక్ష్యం
రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. - 11లో



మొక్కు చెల్లించేందుకొచ్చి..
మొక్కులు చెల్లించేందుకు వచ్చి కృష్ణా బ్యాక్ వాటర్‌లో మునిగి బాలుడితో పాటు మరో ఇద్దరు మృతి చెందారు. - 12లో



హెల్మెట్ ధరించండి..
హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలతో బయట పడొచ్చని పోలీసులు చెబుతున్నారు. - 12లో

దసరా సంబురం



భువనగిరి: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా రోజు గురువారం భువనగిరిలోని నల్లగొండ చౌరస్తాలో రాంతడాక భక్త భజన మండలి వద్ద రావణ దహనం, పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజలు



భువనగిరి: రాంతడాక్ భక్త భజన మండలి వద్ద రిమోట్ కంట్రోల్‌తో రావణ దహనం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి



యాదగిరిగుట్ట: యాదగిరి కొండపై శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలో శమీ పూజ అనంతరం శమీ పత్రాల కోసం పోటీ పడుతున్న భక్తులు

న్యూస్‌రీల్

ప్రజావాణి రద్దు

భువనగిరి: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల పనుల్లో అధికార యంత్రాంగం నిమగ్నమై ఉన్నందున ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలు ముగిసిన అనంతరం యథావిధిగా కొనసాగుతుందని, ఫిర్యాదులు ఇచ్చేందుకు ప్రజలు కలెక్టరేట్‌కు రావద్దని కోరారు.

రూ.6లక్షల విరాళం



ఈఓ రవినాయక్‌కు డీడీ అందజేస్తున్న దాత బీవీవీఎస్ఎన్ రాజు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు నిత్యాన్న దాన వితరణకు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌కు చెందిన భక్తుడు బీవీవీఎస్ఎన్ రాజు రూ.6,48,000 విరాళం అందజేశారు. శ్రీస్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ఈఓ రవినాయక్‌ను కలిసి డీడీ అందజేశారు.

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

భువనగిరి: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు రాష్ట్ర విద్యాశాఖ సెప్టెంబర్ 21న ప్రకటించిన దసరా సెలవులు శుక్రవారంతో ముగిసాయి. శనివారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఆదివారాలు మినహాయిస్తే పండుగ సెలవులు 11 రోజులు వచ్చాయి. జిల్లావ్యాప్తంగా నేటినుంచి పాఠశాలలు తిరిగి తెరుచుకోనున్నాయని డీఈఓ సత్యనారాయణ తెలిపారు.

యాదగిరీశుడికి లక్ష పుష్పార్చన



ఉత్సవమూర్తులకు హారతినిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: ఏకాదశిని పురస్కరించుకొని యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ప్రత్యేక పూజలు పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారం నేత్రపర్వంగా చేపట్టారు. ఆలయ ముఖమండపంలో కొలువైన సువర్ణ పుష్పార్చన మూర్తులకు వివిధ రకాల పుష్పాలు, తులసీదళాలతో లక్ష పుష్పార్చన చేశారు. ఈ వేడుకలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

అందరి చూపు సర్పంచ్ గిరిపైనే!

పెద్ద సంఖ్యలో ఆశావహులు
- ఓట్లు చీలి ప్రత్యర్థులకు లాభం కలగకుండా ముందస్తుగానే అప్రమత్తమైన నేతలు
- ఏకగ్రీవం కోసం ప్రయత్నాలు
- పల్లెల్లో రాజుకున్న ఎన్నికల వేడి



సాక్షి, యాదాద్రి: పల్లెల్లో ఎన్నికల వేడి రాజుకుంది. గ్రామస్థాయిలో కీలకమైన సర్పంచ్ పదవిపైనే అందరి దృష్టి నెలకొంది. ఆరునూరైనా ఎన్నికల బరిలో నిలిచి సర్పంచ్ కుర్చీ దక్కించుకోవాలని అత్యధిక ఆశావహులు ఆశలు పెట్టుకున్నారు. అయితే ఓట్లు చీలి ప్రత్యర్థులకు లాభం కలగకుండా ఉండేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ముందుగానే అప్రమత్తం అయ్యాయి. అవకాశం ఉన్న చోట ఏకగ్రీవం కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. జిల్లాలో 427 గ్రామ పంచాయతీలు ఉండగా.. వీటికి మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి.

మొదలైన బేరసారాలు
2019లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 64 పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. ఎన్నికలు లేకుండానే పాలకవర్గాలను ఎన్నుకున్నారు.ఈసారి కూడా వివిధ రాజకీయ పార్టీలు ఏకగ్రీవంపై దృష్టి సారించాయి.మేజర్, మైనర్ పంచాయతీలు అనే తేడా లేకుండా ప్రయత్నాలు ప్రారంభించాయి.

70 పంచాయతీల్లో ఓటర్లు 500 లోపే..
జిల్లాలో 70 గ్రామ పంచాయతీల్లో 500 లోపు ఓటర్లు ఉన్నారు. వెయ్యి లోపు 143 పంచాయతీలు, రెండు వేల లోపు 163, రెండు వేల కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న పంచాయతీలు 51 ఉన్నాయి.

అతి తక్కువగా గుర్జవానికుంటలో..
జిల్లాలో అతి తక్కువగా తుర్కపల్లి మండలంలోని గుర్జవానికుంట పంచాయతీ(నూతనంగా ఏర్పాటు)లో 174 మంది ఓటర్లు ఉన్నారు. ఇక్కడ పురుషులు 88, మహిళలు 86 మంది నమోదై ఉన్నారు. అలాగే సారగండ్లగూడెంలో 223, రాచకొండలో 240 మంది ఓటర్లు ఉన్నాయి. ఒక్కో పంచాయతీ పరిధిలో ఆరు చొప్పున వార్డులు ఉన్నాయి.

అత్యధికంగా బీబీనగర్‌లో..
జిల్లాలో బీబీనగర్ మేజర్ గ్రామ పంచాయతీ. ఇక్కడ 7,949 మంది ఓటర్లు ఉన్నారు. ఆ తర్వాత వలిగొండలో 7,214 మంది, రామన్నపేటలో 6,892 మంది ఓటర్లు ఉన్నారు. మేజర్ గ్రామ పంచాయతీల్లో తీవ్ర పోటీ నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నువ్వానేనా అన్నట్లుగా తలపడబోతున్నాయి. ఇక్కడ సర్పంచ్ అభ్యర్థులను, వార్డు సభ్యుల టికెట్ల కోసం తీవ్రమైన పోటీ నెలకొంది.

మేజర్ పంచాయతీల్లో పదుల సంఖ్యలో ఆశావహులు
సర్పంచ్ టికెట్ కోసం ప్రధాన పార్టీల్లో తీవ్ర పోటీ నెలకొంది. మేజర్ పంచాయతీల్లో పదుల సంఖ్యలో పోటీ పడుతున్నారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇంచార్జ్‌లు, ముఖ్యనాయకుల వద్ద ఆశావహులు ప్రయత్నాలు ప్రారంభించారు.

కొయ్యలగూడెంపై అందరిలో ఆసక్తి
చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంపై అందరి దృష్టి పడింది. గత ఎన్నికలను గ్రామస్తులు బహిష్కరించారు. 2,198 మంది ఓటర్లు ఉన్న ఈ గ్రామ పంచాయతీలో పురుషులు 1,128, మహిళలు 1,070 మంది ఉన్నారు. కొయ్యలగూడెం గ్రామ పంచాయతీ విభజనపై గ్రామస్తులతో చర్చించకుండానే ఏకపక్షంగా విడదీసి ఎల్లగిరి గ్రామ పంచాయతీని ఏర్పాటు చేశారని నిరసిస్తూ గ్రామస్తులు 2019లో జరిగిన ఎన్నికలను బహిష్కరించారు. ఈసారి జరగనున్న ఎన్నికల్లో పోటీ చేస్తారో లేదోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.

పెద్ద చెరువు పేరు వింటేనే హడల్..



చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మృతదేహం కోసం గాలిస్తున్న రెస్క్యూ టీం (ఫైల్)

చెరువులో దూకి ఐదేళ్లలో 15 మంది ఆత్మహత్య
- నలుగురు ప్రమాదవశాత్తు గల్లంతై మృతి
- కంచె ఏర్పాటు చేయడంలో అధికారులు చోద్యం

బీబీనగర్ : హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న బీబీనగర్ పెద్ద చెరువు పేరు వింటేనే జనం హడలిపోతున్నారు. సందర్శకులకు ఆహ్లాదం పంచాల్సిన పెద్ద చెరువు ఆత్మహత్యలకు అడ్డాగా మారింది. 65 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువులో చోటు చేసుకుంటున్న వరుస సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎప్పుడు శవం తేలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అటు వైపు వెళ్లాలంటే స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

19 ఘటనలు
గడిచిన ఐదు సంవత్సరాల్లో 19 ఘటనలు చోటు చేసుకున్నాయి. వ్యక్తిగత కారణాలతో 15 మంది పెద్దచెరువులో దూకి ఆత్మహత్యలకు పాల్పడగా.. మరో నలుగురు ప్రమాదవశాత్తు చెరువులో పడి మరణించారు. ఆత్మహత్యలకు పాల్పడిన వారిలో స్థానికులతో పాటు హైదరాబాద్ జంటనగరాలకు చెందిన పలువురు ఉన్నారు.

మేల్కొనని అధికారులు
పెద్ద చెరువులో తరుచూ ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు చోటు చేసుకోవడంతో పాటు ప్రమాదవశాత్తు యువకులు నీట మునిగి మృత్యువాత పడుతున్నారు. అయినా చెరువు వద్ద రక్షణ చర్యలు చేపట్టడంతో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలున్నాయి. చెరువులోకి దిగకుండా జాతీయ రహదారి పక్కన, కట్టపై కంచె, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు కొంత కాలంగా కోరుతున్నారు. తమ వినతిని పట్టించుకునే నాథుడే లేడని వారు వాపోతున్నారు.

డేంజర్ జోన్‌గా గుర్తించాలి
బీబీనగర్ పెద్ద చెరువు జాతీయ రహదారి పక్కనే ఉండడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయి. చెరువును డేంజర్ జోన్‌గా ప్రకటించాలి. చెరువు చుట్టూ ఫెన్సింగ్, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
–పంజాల సురేష్‌గౌడ్, బీబీనగర్

ఆలేరు ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



సైదాపురంలో కుటుంబ సభ్యులు, సిబ్బంది, నాయకులతో కలిసి దసరా వేడుకల్లో ఐలయ్య

యాదగిరిగుట్ట రూరల్: ఆలేరు నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి తన ధ్యేయమని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. తన స్వగ్రామమైన యాదగిరిగుట్ట మండలం సైదాపురంలో నిర్వహించిన దసరా వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. తొలుత గ్రామంలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. ఆ తరువాత వాహన పూజలో పాల్గొన్నారు. అనంతరం జమ్మి చెట్టు వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీరిదిద్దుతానని చెప్పారు. గంధమల్ల ప్రాజెక్టు ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యమని, భూ సేకరణ తుది దశకు చేరిందన్నారు. నియోజకవర్గ ప్రజలు సుఖంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీర్ల ఐలయ్య సతీమణి బీర్ల అనిత, సెక్యూరిటీ, పోలీస్ సిబ్బంది, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జోహార్ ఆర్డీఆర్

- తుంగతుర్తికి చేరిన రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పార్థివదేహం
- అంతకుముందు సూర్యాపేటలో భారీ ర్యాలీ
- రెడ్‌హౌస్‌లో మంత్రి సీతక్క, మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, జైవీర్‌రెడ్డి, ప్రముఖుల నివాళి
- కన్నీటి పర్యంతమైన పార్టీ కార్యకర్తలు, అనుచరులు, అభిమానులు
- నేడు వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు



దామోదర్‌రెడ్డి పార్థివదేహంపై కాంగ్రెస్ జెండా కప్పి నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క

సూర్యాపేట : మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాంరెడ్డి దామోదర్‌రెడ్డి (ఆర్డీఆర్) మరణవార్త విని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ఆయన అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఈనెల 2వ తేదీ రాత్రి 10.10 గంటలకు దామోదర్‌రెడ్డి మృతిచెందిన విషయం విదితమే. ఆయన పార్థివదేహాన్ని శుక్రవారం సూర్యాపేటకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన పార్థివదేహాన్ని అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సందర్శించి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పెద్దపులి లాంటి దామన్నకు ఎవరూ సాటిరారని, దేవుడు తమకు అన్యాయం చేసి మా నాయకున్ని తీసుకెళ్లాడని దుఃఖించారు. జోహార్ దామన్న అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ప్రజల సందర్శనార్థం రెడ్‌హౌస్‌కు..
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో నివాళులర్పించిన అనంతరం రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పార్థివదేహాన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో శుక్రవారం సూర్యాపేటలోని రెడ్‌హౌస్‌కు తీసుకొచ్చారు. తమ అభిమాన నాయకున్ని చూసేందుకు పార్టీ కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, యువకులు వేలాది మందిగా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి వేలాది మందిగా తరలివచ్చారు. ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల వద్ద మధ్యాహ్నం 3గంటల నుంచే ప్రజలు వేచిచూశారు. మరికొందరు రెడ్‌హౌస్ వద్ద బారులుదీరారు. సాయంత్రం 5.15 గంటలకు ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకుంది. దామోదర్‌రెడ్డి పార్థివదేహం ఉన్న ప్రత్యేక అంబులెన్స్ ముందుభాగంలో కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి కూర్చుని తన తండ్రిని చూసేందుకు వచ్చిన జనాన్ని చూస్తూ కన్నీటి పర్యంతమయ్యారు. ఎస్వీ ఇంజనీరింగ్ నుంచి పాత బస్టాండ్, పోస్టాఫీస్ సెంటర్, వాణిజ్య భవన్ సెంటర్ శంకర్ విలాస్ సెంటర్ మీదుగా కొత్తబస్టాండ్ నుంచి ర్యాలీగా పార్థివదేహాన్ని రెడ్‌హౌస్‌కు తీసుకెళ్లారు. ఇందులో వేలాది మంది అభిమానులు పాల్గొనడంతో రహదారులన్నీ జనసంద్రంగా మారాయి. శుక్రవారం రాత్రి పొద్దుపోయే దాకా రెడ్‌హౌస్‌లో దామన్న పార్థివదేహాన్ని ప్రజలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి సందర్శించి కడసారి తమ అభిమాన నేతను చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

నేడు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
రాత్రి పొద్దుపోయిన తర్వాత రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పార్థివదేహాన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో తుంగతుర్తికి తరలించారు. అక్కడ ప్రజల సందర్శనార్థం ఉంచిన తర్వాత శనివారం మధ్యాహ్నం 12గంటలకు ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆర్డీఆర్ గడీ పక్కనే పామాయిల్ తోటలో మహా ప్రస్థానం కోసం ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవరావు, డీఎస్పీ ప్రసన్నకుమార్‌లు అంత్యక్రియల కోసం చేస్తున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. సూర్యాపేటలో జరిగిన ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే వేదాపు వెంకయ్య, సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో ఆర్డీఆర్ పార్థివదేహంతో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు

ప్రముఖుల నివాళి
సూర్యాపేటలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (రెడ్ హౌస్)లో దామోదర్‌రెడ్డి పార్థివదేహానికి అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రామచందర్ నాయక్, రాష్ట్ర మంత్రి సీతక్క శుక్రవారం రాత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు కుందూరు జానారెడ్డి, నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వేదాసు వెంకయ్య, జూలకంటి రంగారెడ్డి, సంకినేని వెంకటేశ్వర్‌రావు, గాదరి కిషోర్, చిరుమర్తి లింగయ్య, దోసపాటి గోపాల్, వివిధ పార్టీల నాయకులు చెరుకు సుధాకర్, బడుగుల లింగయ్య యాదవ్, పిట్ట రాంరెడ్డి, మల్లు లక్ష్మి, మల్లు నాగార్జున రెడ్డి తదితరులు నివాళులర్పించారు. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రైతు కమిషన్ సమన్వయ కమిటీ సభ్యుడు, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవు తదితరులు సర్వోత్తం రెడ్డి వెన్నంటే ఉన్నారు.



నాలుగు రోజుల్లోనే 24 రూ.కోట్లు

ఆబ్కారీ శాఖకు దసరా కిక్కు
- రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు
- గత ఏడాదితో పోల్చితే రూ.7 కోట్లు అధికం

ఆలేరు, భువనగిరి: దసరా పండుగ ఎక్సైజ్ శాఖకు ఫుల్లు కిక్కునిచ్చింది. రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు జరగడంతో భారీగా ఆదాయం సమకూరింది. గాంధీ జయంతి రోజున మద్యం, మాంసం అమ్మకాల నిషేధం నేపథ్యంలో ముందస్తుగానే రెట్టింపు స్థాయిలో విక్రయాలు జరిగాయి. జిల్లాలోని ఆలేరు, భువనగిరి, మోత్కూరు, రామన్నపేట ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో 83 మద్యం దుకాణాలు ఉన్నాయి. దసరా పండుగ, మరో వైపు స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సెప్టెంబర్ 27,29,30 తేదీలతో పాటు ఈనెల 1వ తేదీన వైన్స్‌ల నిర్వాహకులు మద్యం డిపోల నుంచి పెద్ద ఎత్తున మద్యం లిఫ్టింగ్ చేశారు. 25,700 కాటన్ల బీర్లు, 27,968 కాటన్ల మద్యం తరలించారు. మొత్తం రూ24.30 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఇది సాధారణ రోజులతో పోల్చితే రెట్టింపు అని కొందరు వైన్స్‌ల నిర్వాహకులు తెలిపారు. సెప్టెంబర్‌లో సుమారు రూ.82కోట్ల అమ్మకాలు జరగగా, నాలుగు రోజుల్లోనే రూ.24.30 కోట్ల వ్యాపారం జరిగినట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. సాధారణ రోజుల్లో ఒక షాప్‌లో రోజుకు రూ.3.50 నుంచి రూ.4 లక్షల మద్యం విక్రయాలు జరుగుతాయి. పండుగ సందర్భంగా ఒక్కొక్క షాప్‌లో రోజుకు రూ.10లక్షల వరకు విక్రయాలు జరిగాయని తెలుస్తోంది. ప్రస్తుతం మద్యం దుకాణాల్లో 10శాతం సరుకు మాత్రమే మిగిలినట్టు సమాచారం. మొత్తంగా గత సంవత్సరం దసరాతో పోల్చితే ఈసారి రూ.7కోట్ల విలువ చేసే మద్యం అమ్మకాలు అధికంగా జరిగినట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.

మద్యం అమ్మకాలు (కాటన్లలో)

తేదీ	బీర్లు	లిక్కర్
27న	5,598	3,876
29	10,371	8,519
30	8,731	12,573
01న	1,000	3,000
	25,700	27,968

మటన్, చికెన్ విక్రయాలూ ఫుల్
మరోవైపు జిల్లాలో రికార్డు స్థాయిలో మాంసం విక్రయాలు జరిగినట్లు తెలుస్తోంది. సుమారు 1 లక్ష క్వింటాళ్ల మటన్, 2 లక్షల క్వింటాళ్ల చికెన్ విక్రయాలు జరిగినట్టు అంచనా. ఒక్క ఆలేరు పట్టణంలో సుమారు 10వేల క్వింటాళ్ల మటన్, 20వేల క్వింటాళ్ల చికెన్ అమ్మకాలు జరిగాయని తెలిసింది.

పొద్దు పొడవక ముందే..
సాక్షి, యాదాద్రి: గాంధీ జయంతి రోజు మద్యం, మాంసం అమ్మకాలపై ప్రభుత్వం ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. అదే రోజు దసరా పండుగ రావడంతో ఎలా విక్రయించాలన్న ఆలోచనకు వ్యాపారులు కార్యరూపం ఇచ్చారు. ఒక రోజు ముందుగానే 1వ తేదీ రాత్రి 2 గంటల వరకు మద్యం, మాంసం విక్రయించారు. పండుగ రోజు లిక్కర్ షాపులు మూసి ఉంటాయి కాబట్టి ముందు రోజే రహస్య ప్రాంతాల్లో మద్యం డంప్ చేసి అధిక ధరలకు విక్రయించారు. మటన్, చికెన్ మాత్రం 2వ తేదీ తెల్లవారుజామున 5 గంటల వరకు విక్రయించారు. నిషేధం వల్ల కొందరు మేకలు, పొట్టేళ్లను కొనుగోలు చేసి కోసి పంచుకున్నారు. అంక్షల నేపథ్యంలో మందు, మటన్, చికెన్ ధరలు పెరిగాయి.

క్లుప్తంగా

యాదగిరీశుడి సేవలో ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి



శేషాద్రికి లడ్డూ ప్రసాదం, శ్రీస్వామి వారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఈఓ రవి కుమార్

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి విజయదశమి సందర్భంగా గురువారం కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చక బృందం ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు ముఖ మండపంలో వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ రవి నాయక్ లడ్డూప్రసాదం అందజేశారు.

ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం



అమ్మవారికి హారతినిస్తున్న అర్చకులు.

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం అమ్మవారిని బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అమ్మవారిని అద్దాల మండపంలో అధిష్ఠించి ఊంజల్ సేవోత్సవాన్ని జరిపించారు. ఇక ఆలయంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజ వాహన సేవ, నిత్య కల్యాణం నిర్వహించారు.

స్వర్ణగిరీశుడికి సూర్యప్రభ వాహన సేవ



స్వామి వారికి సూర్యప్రభ వాహన సేవ నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

భువనగిరి: పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు స్వామి వారికి సూర్యప్రభ వాహన సేవ నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, తోమాల సేవ, స్వామి వారికి పద్మావతి అమ్మవార్లకు నిత్యకల్యాణ మహోత్సవం, సాయంత్రం పెద్ద శేషవాహన సేవ, పద్మావతి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన జరిపించారు. అంతకు ముందు స్వామి వారికి ఏకాదశి సందర్భంగా స్వామి వారికి నవకలశ పంచామృతభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మినీ శిల్పారామంలో దసరా ఉత్సవాలు

భువనగిరి: మండలంలోని రాయగిరి గ్రామ పరిధిలో గల మినీ శిల్పారామంలో దసరా ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఆలేరుకు చెందిన డ్యాన్స్ టీచర్ దుర్గారావు ఆధ్వర్యంలో కూచిపూడి ప్రదర్శన నిర్వహించారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

దామన్న యాదిలో..



తుపాకీని సరిచేస్తున్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి (ఫైల్)



తుంగతుర్తిలో మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి నిర్మించిన విశాలమైన గడి

- ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన రాంరెడ్డి దామోదర్‌రెడ్డి
- కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి

తిరుమలగిరి (తుంగతుర్తి) : కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉన్న తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా, ఒక్కసారి స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి రికార్డు సృష్టించిన వ్యక్తి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి. ఖమ్మం జిల్లా లింగాల గ్రామానికి చెందిన ఆయన తుంగతుర్తికి చెందిన ఉప్పునూతల కౌసల్యాదేవి రెండవ కుమార్తె వరూధిని వివాహం చేసుకొని ఇక్కడే స్థిరపడ్డారు. అప్పటి నుంచే కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ప్రజల పక్షాన అనేక ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించారు. 1985 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తుంగతుర్తి నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇక్కడ కమ్యూనిస్టు పార్టీదే ఆధిపత్యం ఉండేది. దామోదర్‌రెడ్డి కమ్యూనిస్టుల ఆధిపత్యాన్ని తగ్గించి వరుసగా 1985, 1989, 2004లో గెలుపొందారు. 1994లో కాంగ్రెస్ పార్టీ టికెట్ నిరాకరించడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 1994లో తెలుగుదేశం పార్టీ ప్రభంజనంలో జిల్లాలో 11 నియోజకవర్గాలలో టీడీపీ మిత్ర పక్షాల అభ్యర్థులు గెలుపొందగా దామోదర రెడ్డి ఒక్కరు మాత్రమే స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి కాంగ్రెస్ పక్షాన నిలబడ్డారు. 1992లో నెదురుమల్లి జనార్దన్‌రెడ్డి, 2004లో వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రుల హయాంలో కేబినెట్ మంత్రిగా పనిచేశారు.



తుంగతుర్తిలోని దామోదర్‌రెడ్డి నివాసం వద్ద ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్

అధునాతన పంటల సాగుపై ఆసక్తి

మాజీ మంత్రి దామోదర్‌రెడ్డికి పశు సంపద, వ్యవసాయం అంటే చాలా ఆసక్తి. తుంగతుర్తిలోని 130 ఎకరాల్లో అల్లనేరేడు, సపోట, మామిడి, పామాయిల్ తోటలు వేశారు. అలాగే కూరగాయల సాగు చేశారు. ఈ ప్రాంత రైతులకు నూతన పంటలపై అవగాహన కల్పించి వ్యవసాయ శాస్త్రవేత్తలతో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించేవారు. అదేవిధంగా ఎడ్ల గిత్తలను పెంచి వాటికి శిక్షణ ఇప్పించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రాంతాల్లో జరిగే ఎడ్ల పందెంలో పోటీ చేయించేవారు. రాంరెడ్డి బ్రదర్స్ ఎడ్ల గిత్తలకు మంచి పేరు ఉండేది. ఎడ్ల గిత్తల స్పెర్మ్‌తో మేలు జాతి పశువుల ఉత్పత్తికి శ్రీకారం చుట్టారు. అదేవిధంగా వివిధ దేశాల నుంచి శునకాలను తీసుకువచ్చి శిక్షణ ఇప్పించి పోటీల్లో ఉంచేవారు.



దామోదర్‌రెడ్డి కొనుగోలు చేసిన వాహనాలు

9 ఎకరాలలో గడి ఏర్పాటు

తుంగతుర్తిలో 9 ఎకరాల్లో విశాలమైన ప్రాచీన గడి ఉంది. దామోదర్‌రెడ్డి ఇందులోనే ఉండేవారు. గడి చుట్టూ ప్రహరీ నిర్మించి సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. గడి చుట్టూ పామాయిల్ తోటలు, పండ్ల తోటలు సాగు చేసేవారు. ఈ మధ్య కాలంలోనే గడిని ఆధునీకరించి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఆయన మార్కెట్‌లోకి వచ్చిన కొత్త వాహనాలను కొనుగోలు చేసేవారు. ట్రాక్టర్లు, జీప్‌లు, వ్యాన్‌లపై ఎక్కువ మక్కువ ఉండేది. ఏ ఒక్క వాహనాన్ని అమ్మకుండానే గడి ముందు ఉంచారు.

వ్యవసాయమంటే మక్కువ

దామోదర్‌రెడ్డికి వ్యవసాయం అంటే చాలా మక్కువ. ఈ ప్రాంతానికి నీటి సౌకర్యం తీసుకొచ్చి రైతులకు మేలు చేయాలనే సాకుతో ఎన్నో ఉద్యమాలు చేశారు. 1996లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎస్ఆర్ఎస్‌పీ కాల్వలకు శంకుస్థాపన చేసి వదిలేశారు. 1999లో అప్పటి సీఎల్‌పీ నేత పి.జనార్దన్‌రెడ్డితో కలిసి దామోదర్‌రెడ్డి శిలా ఫలకం వద్ద రక్తతర్పణం చేశారు. అలాగే వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఇదే శిలాఫలకం వద్ద మొక్కలు నాటి నిరసన తెలిపారు. 2004లో వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే జల యజ్ఞంలో భాగంగా ఎస్ఆర్ఎస్‌పీ కాల్వలకు నిధులు కేటాయింపజేసి కాల్వ పనులు పూర్తి చేయించారు. 2009లో ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి చేతుల మీదుగా గోదావరి జలాలను విడుదల చేయించారు. ఈ కాల్వల ద్వారా జిల్లాకు వందల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.



తనకు సెంటిమెంట్‌గా భావించే బ్యాగ్‌తో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న దామోదర్‌రెడ్డి (ఫైల్)

లక్కీ బ్యాగ్

మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో వినూత్నంగా ఉండేవారు. ప్రచారం జరిగిన ప్రతిరోజు చేతికి లెదర్ బ్యాగ్ ఉండేది. ఆయన ఇది తనకు సెంటిమెంట్‌గా భావించేవారు. ప్రచారంలో పార్టీ ముఖ్య నాయకులను, ప్రజలను కలిసే సమయంలో ఈ బ్యాగ్ ఉండడంతో ప్రజలంతా బ్యాగ్‌ను ఆసక్తిగా చూసేవారు. అందులో ఏం ఉందోనని చర్చించుకునేవారు. కొందరు డబ్బులు ఉండి ఉంటాయని.. మరికొందరు పిస్టల్ ఉంటుందని చర్చించుకునేవారు.



ఆత్మకూరు(ఎం) మండలం రహీంఖాన్‌పేట నూతన పంచాయతీ భవనం ప్రారంభించిన అనంతరం మాట్లాడుతున్న దామోదరరెడ్డి(ఫైల్)



తన పందెం గిత్తలతో దామోదర్‌రెడ్డి (ఫైల్)



పాదయాత్రలో వైఎస్సార్ వెంట ఆర్డీఆర్ (ఫైల్)

అర్వపల్లిలో పూజలు చేశాకే ఎన్నికల ప్రచారం

అర్వపల్లి: మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఇలవేల్పు దైవం. దామోదర్‌రెడ్డి అత్త ఉప్పునూతల కౌసల్యాదేవి పూర్వీకులు అప్పట్లో 750 ఎకరాల భూమిని అర్వపల్లి ఆలయానికి దానం చేశారు. దామోదర్‌రెడ్డి తుంగతుర్తి, సూర్యాపేట రెండు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేగా పోటీచేసిన ప్రతిసారి బీఫామ్‌తో ఇక్కడి ఆలయానికి వచ్చి పూజలు చేసిన అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించడం ఆనవాయితీ. అదేవిధంగా ప్రతి ఏటా ఇక్కడి ఆలయంలో స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగే కల్యాణోత్సవానికి దామోదర్‌రెడ్డి పట్టువస్త్రాలు, తలంబ్రాలు పంపిస్తారు. వారి కుటుంబం ఏ మంచి కార్యక్రమాలు చేపట్టాలన్నా ఇక్కడి ఆలయాన్ని దర్శించుకొని పూజలు చేసి పనులు ప్రారంభిస్తారు.



అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఆర్డీఆర్ (ఫైల్)

40 ఏళ్లుగా ఆర్డీఆర్ వెంటే ఉన్నా



40 ఏళ్లుగా నేను దామోదర్‌రెడ్డి వెంటే ఉన్నా. రాజకీయాల్లో చురుకుగా పాల్గొనడంతో పాటు ఆయన బాగోగులు చూసుకునేవాడిని. ఆయనకు వ్యవసాయం అంటే ఎంతో మక్కువ. తుంగతుర్తిలో శాశ్వతంగా ఉండటానికి ఏడాది కిందట గడీని మరమ్మతు చేయించుకొని ఎక్కువ సమయం ఇక్కడే గడిపేవారు. ఆయన గుర్తులు ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరు.

– పెండెం రామ్మూర్తి, సీనియర్ నాయకుడు

ఆర్డీఆర్ హయాంలోనే అభివృద్ధి జరిగింది



1985కు ముందు తుంగతుర్తి నియోజకవర్గం అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడి ఉండేది. ఆర్డీఆర్ ఎమ్మెల్యే అయ్యాక నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. ప్రతి గ్రామంలో రోడ్లు, విద్యుత్, తాగు, సాగు నీటి సమస్యలు పరిష్కరించారు. గోదావరి జలాలు తీసుకువచ్చి కరువుతో అల్లాడుతున్న ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారు.

– దరూరి యోగానందచారి, డీసీసీ ఉపాధ్యక్షుడు

మహా ప్రస్థానానికి ఏర్పాట్లు

తుంగతుర్తి : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అంతిమయాత్రకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తుంగతుర్తిలోని దామోదర్ రెడ్డి గడి వెంట ఉన్న ఆయిల్ పామ్ సాగు తోటలో మహాప్రస్థానానికి ఆర్డీఓ వేణుమాధవ్, డీఎస్పీ ప్రసన్నకుమార్ శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. అదేవిధంగా గడి పరిసర ప్రాంతాల్లో చదును చేయించారు. వారి వెంట సీఐ నరసింహారావు, ఎస్సై క్రాంతి కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



ఆయిల్‌పామ్ తోటలో మహాప్రస్థానానికి స్థల పరిశీలన చేస్తున్న ఆర్డీఓ, డీఎస్పీ



సూర్యాపేటలోని రెడ్‌హౌస్‌లో ఆర్డీఆర్ పార్థివ దేహంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క, మాజీ మంత్రి జానారెడ్డి, ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



ఆర్డీఆర్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్



ఆర్డీఆర్ పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న సంకినేని వెంకటేశ్వరరావు తదితరులు



నివాళులర్పిస్తున్న చెరుకు సుధాకర్



నివాళులర్పిస్తున్న జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి

లే.. తాతయ్యా



రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పార్థివదేహం వద్ద రోదిస్తున్న ఆయన మనుమడు





దామోదర్‌రెడ్డి పార్థివదేహం వద్ద రోదిస్తున్న ఆయన అభిమానులు

చికిత్స పొందుతూ మహిళ మృతి



అంజనమ్మ (ఫైల్)

డిండి: బ్లడ్ ఇన్‌ఫెక్షన్ కారణంగా చికిత్స పొందుతున్న మహిళ శుక్రవారం మృతి చెందింది. గ్రామస్తులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండల కేంద్రానికి చెందిన ఈరటి ఆంజనేయులు, ఈరటి అంజనమ్మ(30) దంపతులు కూలీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. అంజనమ్మ మూడవ సంతానంలో భాగంగా గర్భిణి కావడంతో డెలివరీ నిమిత్తం గత నెల 6న నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అదే రోజు డెలివరీ కావడంతో పాప పుట్టింది. అంజనమ్మకు రక్తం తక్కువగా ఉండడంతో వైద్యులు ఆమెకు రక్తం ఎక్కించారు. గంట తర్వాత అంజనమ్మ ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స నిమిత్తం వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌కు తరలించారు. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంజనమ్మ శుక్రవారం మృతి చెందింది. మృతురాలికి భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కల్వకుర్తి ఆస్పత్రిలోని వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే అంజనమ్మ మృతి చెందినందని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

నీటిసంపులో పడి మూడేళ్ల బాలుడు మృతి



హర్షద్‌రామ్ (ఫైల్)

కనగల్: మండలంలోని పగిడిమర్రి గ్రామంలో పండగ పూట విషాదం నెలకొంది. నీటి సంపులో పడి మూడేళ్ల బాలుడు దుర్మరణం చెందాడు. పగిడిమర్రికి చెందిన ఇటికాల రామలింగం – శ్రీలత కుమారుడు హర్షద్ రామ్(3) శుక్రవారం మధ్యాహ్నం ఇంటి ఆవరణలో బొమ్మలతో ఆడుకుంటుండగా బొమ్మ నీటి సంపులో పడింది. దానిని బయటకు తీసే క్రమంలో బాలుడు ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. తల్లిదండ్రులు కొద్దిసేపటి తర్వాత బయటకి రాగా కుమారుడు నీటిసంపులో పడి ఉండటాన్ని గమనించి బయటకు తీశారు. అప్పటికే అతడు ప్రాణాలు కోల్పోయాడు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



మిర్యాలగూడ అర్బన్: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. టూ టౌన్ ఎస్ఐ రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని రాజీవ్‌చౌక్ వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్న 48 ఏళ్ల వ్యక్తిని గుర్తించిన స్థానికులు 108 అంబులెన్స్ సాయంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. అతడు కొద్ది రోజులుగా పట్టణంలో భిక్షాటన చేస్తూ సంచరిస్తున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వివరాలు తెలిస్తే 87126 70150, 99664 98185 నంబర్లను సంప్రదించాలని కోరారు.

శ్రీనివాసాచారికి దసరా పురస్కారం



ఇడికోజు శ్రీనివాసాచారి

రామగిరి(నల్లగొండ): విజయదశమి పర్వదినం సందర్భంగా విశ్వకర్మ ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రతి సంవత్సరం అందించే దసరా పురస్కారం – 2025కు నల్లగొండకు చెందిన తెలుగు అధ్యాపకుడు ఇడికోజు శ్రీనివాసాచారి ఎంపికయ్యారు. అక్టోబర్ 5న హైదరాబాద్‌లో జరిగే దసరా పురస్కారాల ప్రదానోత్సవంలో ఈ అవార్డు అందుకోనున్నారు. ఇడికోజు శ్రీనివాసాచారి తెలుగు భాష, జానపద అధ్యయనం, సాహిత్య సమీక్ష, సాంస్కృతిక పరిరక్షణకు ఆయన చేసిన కృషికిగాను ఆయనకు అవార్డు అందజేయనున్నారు.

శ్రీరాజరాజేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనం



శ్రీరాజరాజేశ్వరీ దేవి అలంకరణలో శ్రీపర్వత వర్ధిని అమ్మవారు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. సెప్టెంబర్ 22న ప్రారంభమైన శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం మహాపూర్ణాహుతితో ముగిశాయి. ఉదయం అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరీదేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మహా పూర్ణాహుతి నిర్వహించి, కలశోద్వాసన పూజ జరిపించారు. సాయంత్రం 5.30గంటలకు విజయదశమి వేడుక, శమీ పూజతో ఉత్సవాలు ముగించారు.

6న హెచ్ఎండీఏ కార్యాలయం ఎదుట ధర్నా



మాట్లాడుతున్న జహంగీర్

భువనగిరి: రీజినల్ రింగ్‌రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులతో కలిసి ఈ నెల 6న హెచ్ఎండీఏ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జహంగీర్ కోరారు. శుక్రవారం భువనగిరిలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన పార్టీ కమిటీ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన అలైన్‌మెంట్ కాకుండా 28 కిలోమీటర్లు కుదించడం వల్ల వరి, పత్తి పంటలు పండించే సారవంతమైన భూములు రైతులు కోల్పోతున్నారన్నారు. సాగుకు యోగ్యం కాని భూములు తీసుకోవాలని చట్టం చెబుతున్నా పారిశ్రామిక వేత్తలు, రాజకీయ నాయకులు, సంపన్న వర్గాలను కాపాడేందుకు అలైన్‌మెంట్ మార్చి రైతులకు నష్టం కలిగిస్తున్నారని ఆరోపించారు. కొండమడుగు నర్సింహ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు బట్టుపల్లి అనురాధ, మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, పెంటయ్య, కృష్ణారెడ్డి, స్వామి, నర్సింహ, చంద్రారెడ్డి, యాదగిరి, యాదిరెడ్డి, జయరాములు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యాదగిరి క్షేత్రంలో శమీ పూజ



యాదగిరి ఆలయ తూర్పు మాడ వీధిలో శమీ వృక్షానికి పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: విజయదశమిని పురస్కరించుకొని యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం గజవాహన సేవను ఆలయ తిరు, మాడ వీధుల్లో ఊరేగించారు. తూర్పు మాడ వీధిలో గజవాహన సేవను అధిష్ఠించి శమీ వృక్షానికి పూజలు చేశారు.

లడ్డూ వేలం రూ.2,05,016



దక్కించుకున్న లడ్డూతో అర్రూరి రమేష్

చిట్యాల: దేవీ శరన్నవరాత్రి వేడుకల సందర్భంగా మండలంలోని ఆరెగూడెం గ్రామంలో దుర్గా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహం చేతిలో ఉంచి పూజలు చేసిన లడ్డూకు శుక్రవారం వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో ఆ గ్రామానికి చెందిన అర్రూరి రమేష్–లక్ష్మీ దంపతులు రూ.2,05,016 కు లడ్డూ దక్కించుకున్నారు. కార్యక్రమంలో వల్లందాసు సంతోష్, జోగు రాజు, నంద్యాల వినయ్, వెంకటేష్, కిరణ్, విగ్నేష్ పాల్గొన్నారు.

లచ్చిరాంకు గ్లోబల్ పీస్ అవార్డు



లచ్చిరాం

మర్రిగూడ : మండలంలోని దామెరబీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఉదావత్ లచ్చిరాంకు భారత్ బ్రాండ్ బుక్ ఆఫ్ రికార్డ్ న్యూఢిల్లీ సీఈఓ డీకే రాజు శుక్రవారం ఆన్‌లైన్‌లో గ్లోబల్ పీస్ అవార్డు–2025 అందించారు. విద్యార్థులకు స్వాతంత్య్ర ఉద్యమనాటి సంఘటనలను వివరించడం, విద్యార్థులకు జాతీయ నాయకుల వేషధారణలు వేయించడం, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మై గవర్నమెంట్ క్విజ్ కార్యక్రమంలో తనతోపాటు పాఠశాల విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సహించడం, విద్యార్థులకు మెరుగైన విద్యను బోధించడంలో కృషి చేసినందుకు లచ్చిరాంకు ఈ అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఐదు గేట్ల ద్వారా పులిచింతల నీటి విడుదల



పులిచింతల ప్రాజెక్టు నుంచి దిగువకు వదులుతున్న వరద

మేళ్లచెరువు : చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టుకు వరదనీరు భారీగా వచ్చి చేరుతోంది. శుక్రవారం ఈ ప్రాజెక్టుకు 2,24,678 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా 5 గేట్ల ను 4 నుంచి 5 మీటర్ల మేర ఎత్తి 1,85,700 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారు. టీజీ జెన్‌కో 16,600 క్యూసెక్కుల నీటిని ఉపయోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

మనస్తాపంతో వృద్ధుడు మృతి

చిట్యాల: గత ఐదు నెలల క్రితం భార్య మృతి చెందడంతో ఒంటరిగా ఉంటూ మనస్తాపానికి గురైన వృద్ధుడు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన చిట్యాలలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చిట్యాల పట్టణంలోని ముత్యాలమ్మగూడేనికి చెందిన ఉయ్యాల శంకరయ్య(79) భార్య ఐదు నెలల క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి ఆయన ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. ఇటీవల మనస్తాపానికి గురై శుక్రవారం ఇంట్లోని వంటగదిలో ఐరన్ రాడ్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కూతురు అనంతుల మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మోడు వారిన చెట్లు

రామన్నపేట: మండలంలోని నిధానపల్లి చెరువులో సుమారు 30 సంవత్సరాల క్రితం ప్రభుత్వం తుమ్మచెట్లను నాటించింది. ఏపుగా పెరిగిన కొన్ని చెట్లు కొంతకాలంగా ఎండిపోతున్నాయి. ప్రస్తుతం చెరువులోని దాదాపు అన్నిచెట్లు మోడువారి కనిపిస్తున్నాయి.



స్వర్ణగిరిలో శేషవాహన సేవ

భువనగిరి : యాదాద్రి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణ పరిధిలోని స్వర్ణగిరి క్షేత్రంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి నిర్వహించిన స్వామివారి పెద్ద శేష వాహన సేవ నేత్రపర్వంగా కొనసాగింది.



మొక్కులు చెల్లించేందుకు వచ్చి మృత్యుఒడిలోకి

- స్నానం చేసేందుకు కృష్ణాబ్యాక్ వాటర్‌లోకి దిగి ప్రమాదవశాత్తు నీట మునిగిన బాలుడు
- అతడిని కాపాడేందుకు వెళ్లిన మరో ఇద్దరు మృతి
- చందంపేట మండలం దేవరచర్ల సమీపంలో ఘటన



రాము మృతదేహం వద్ద వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ



కేతావత్ రాము మృతదేహం



ఉమాసాయి కాంత్ (ఫైల్)



పూర్ణ గోపాల భరత్ (ఫైల్)

చందంపేట : స్నానమాచరించేందుకు కృష్ణా బ్యాక్ వాటర్‌లోకి ఓ బాలుడు దిగి ప్రమాదవశాత్తు అందులో జారి పడ్డాడు. అతడిని కాపాడేందుకు మరో ఇద్దరు దిగగా వారు కూడా నీటమునిగి మృత్యువాత పడ్డారు. ఈ ఘటన చందంపేట మండలంలోని దేవరచర్లలో గురువారం చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెనాలికి చెందిన కేతావత్ రాము(32), వినుకొండ పరిధిలోని బొల్లపల్లి మండలం గండిగనుముల గ్రామానికి చెందిన వాంకుడావత్ పూర్ణ గోపాలభరత్(22), అవనిగడ్డకు చెందిన ఉమాసాయికాంత్(11)తో పాటు పలు కుటుంబాలు తుల్జా భవాని అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు ప్రైవేటు వాహనాల్లో సెప్టెంబర్ 30న చందంపేట మండల పరిధిలోని దేవరచర్లకు చేరుకున్నారు. రాత్రి దేవాలయం వద్ద బస చేసి తెల్లవారుజామున బుధవారం దేవరచర్ల గ్రామంలోని కృష్ణా వెనుక జలాలు, డిండి ప్రాజెక్టు జలాలు కలిసే చోట వాగులో స్నానమాచరించి పూజలు చేశారు. మరుసటి రోజు గురువారం తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు. ఈక్రమంలో స్నానమాచరించి వెళ్దామని అనుకున్నారు. ఈ క్రమంలో ఉమా సాయికాంత్ స్నానం చేసేందుకు వాగులోకి దిగాడు. వాగు లోతు ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. గమనించిన కేతావత్ రాము, పూర్ణ గోపాలభరత్ సాయికాంత్‌ను కాపాడేందుకు వాగులోకి దిగి నీటమునిగారు. ఈత రాకపోవడంతో ముగ్గురు మృత్యువాతపడ్డారు. స్నానం కోసం వెళ్లిన ముగ్గురు ఇంకా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అక్కడి చేరుకుని విషయాన్ని గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు. డిండి సీఐ బీసన్న, చందంపేట ఎస్‌ఐ లోకేష్ ఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం రాము, పూర్ణ గోపాల భరత్ మృతదేహాలు లభ్యం కాగా శుక్రవారం ఉమా సాయికాంత్ మృతదేహం లభ్యమైంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

తీరని కడుపు కోత

పూర్ణగోపాల్‌భరత్ ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. ఇతడి తల్లి చిన్నతనంలోనే చనిపోగా తండ్రి కూలీనాలి చేస్తూ ఎంబీబీఎస్ చదివిస్తున్నాడు. కుమారుడిని డాక్టర్ చేయాలని భావించిన తండ్రికి తీరని పుత్ర శోకం మిగిలింది. అవనిగడ్డకు చెందిన ప్రైవేట్ స్కూల్ టీచర్ జటావత్ నాగేశ్వర్‌రావు, నాగమణిలకు ఉమాసాయికాంత్ ఒక్కడే కుమారుడు. కుమారుడి మరణాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. తెనాలి ప్రాంతంలోని ఓ హోటల్‌లో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న కేతావత్ రాము మరణంతో అతడి భార్య, ఇద్దరు కుమారులు పెద్దదిక్కును కోల్పోయారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరు అన్నదమ్ములు దుర్మరణం

- పండుగ రోజు అమ్మమ్మ ఇంటికి వచ్చి వెళ్తుండగా ఘటన



నాగరాజు (ఫైల్)



కార్తీక్ (ఫైల్)



రోదిస్తున్న తల్లిదండ్రులు

తుంగతుర్తి, తిరుమలగిరి : దసరా పండుగ రోజు అమ్మమ్మ ఇంటికి వచ్చి వెళ్తుండగా.. బైక్ అదుపు తప్పి ఇద్దరు సోదరులు మృతి చెందారు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం బండ రామారం క్రాస్ రోడ్డు వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. తిరుమలగిరి మండలంలోని మాలిపురం గ్రామానికి చెందిన వేముల దేవయ్య, మంగమ్మకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు నాగరాజు(26) గత డిసెంబర్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికై హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్నాడు. రెండో కుమారుడు కార్తీక్ (24)కు ఆర్టీసీలో ఉద్యోగం పొంది కొద్దిరోజులు పనిచేసి, అనంతరం ఆ ఉద్యోగాన్ని వదిలి గ్రామంలోనే ఉంటూ ప్రైవేట్ డ్రైవర్‌గా చేస్తున్నాడు. దసరా పండుగ నేపథ్యంలో నాగరాజు, కార్తీక్‌లు ఇద్దరూ ఇంట్లో చేసిన వంటకాలను తుంగతుర్తి మండల కేంద్రంలోని తమ అమ్మమ్మ కత్తుల ఎల్లమ్మకు ఇచ్చి రాత్రి సమయంలో బైక్‌పై తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నారు. బండ రామారం క్రాస్ రోడ్డు వద్ద అదుపుతప్పి పడిపోవడంతో కార్తీక్‌కు తీవ్రగాయాలు తగిలి అక్కడికక్కడే చనిపోయాడు. నాగరాజును చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించగా.. శుక్రవారం ఉదయం మృతి చెందాడు. తుంగతుర్తి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతిచెందిన ఇద్దరు సోదరులు అవివాహితులు. మంగమ్మ అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పని చేస్తుండగా.. దేవయ్య వ్యవసాయం చేస్తూ ఇద్దరు కుమారులను కష్టపడి చదివించి ప్రయోజకులను చేశారు. ఉద్యోగం వచ్చి జీవితంలో స్థిరపడతారనుకున్న కొద్దిరోజులకే రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో వారి రోదనలు మిన్నంటాయి.


కొనసాగుతున్న కృష్ణమ్మ పరవళ్లు



26 గేట్ల ద్వారా విడుదలవుతున్న వరద నీరు

నాగార్జునసాగర్ : సాగర్ వద్ద కృష్ణమ్మ పరవళ్లు కొనసాగుతున్నాయి. ఎగువ నుంచి 2,61,176 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా.. 2,56,244 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్ జలాశయం నుంచి విడుదల చేస్తున్నారు. 26 రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా 2,02,956 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 33,211 క్యూసెక్కులు కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.0450టీఎంసీలుకాగా.. 305.6242 టీఎంసీల నీరు ఉంది.

మూసీకి తగ్గిన ఇన్‌ఫ్లో



మూసీ గేట్లు ఎత్తడంతో దిగవకు విడుదలవుతున్న వరదనీరు

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో తగ్గింది. శుక్రవారం ప్రాజెక్టులోకి 3,227 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా అధికారులు రెండు గేట్లను రెండు అడుగుల మేర పైకెత్తి 3,138 క్యూసెక్కుల నీటిని దిగువ మూసీకి వదులుతున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠ నీటిమట్టం 645 అడుగులు కాగా ప్రస్తుతం 644 అడుగుల వద్ద నీరు నిల్వ ఉంచి దిగువకు నీటి విడుదల కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు 483 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సీపేజీ, లీకేజీ, ఆవిరి రూపంలో మరో 48 క్యూసెక్కుల నీరు వృథా అవుతోంది.

సస్యరక్షణతో అధిక దిగుబడులు

పాడిపంట

పెద్దవూర: ప్రస్తుతం కంది పంట పూత దశలో ఉంది. విస్తారంగా సాగు చేసిన కందిలో సస్యరక్షణ పద్ధతులను సకాలంలో చేపట్టడంతో మేలైన దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి సందీప్ తెలిపారు. కందిని ఆశించే తెగుళ్లు, పురుగులు, నివారణ చర్యల గురించి ఆయన మాటల్లోనే..

కాయ ఈగ

తల్లి పురుగులు నల్లటి ఈగ ఆకారంలో ఉండి కంది పిందెలు, కాయలపై కవచాల్లోకి తమ ప్రత్యేక అవయవాలతో గుడ్లను లోపలికి చొప్పిస్తాయి. వీటి నుంచి వెలువడే తెల్లని కాళ్లులేని పిల్ల పురుగులు కాయలోని గింజల పైభాగంలో దారులు చేసుకుంటూ పెరుగుతాయి. ఈ క్రమంలో ఇవి గింజ లోపలి భాగమంతా డొల్లగా చేస్తాయి. కాయ లోపలి పురుగు మొక్క ఉనికిని కాయ కవచంపై ఏర్పడే పల్చటి పొర ద్వారా గుర్తించవచ్చు. కాయ నుంచి పురుగు వెలువడిన గుర్తుగా చిన్న రంధ్రం కాయ పైభాగంలో ఏర్పడుతుంది.

నివారణ

తల్లి పురుగులను గుర్తించిన వెంటనే వాటి వ్యాప్తిని, పెరుగుదలను అదుపులో ఉంచేందుకు లీటర్ నీటికి 1.6 మిల్లీ లీటర్ల మోనోక్రోటోఫాస్ లేదా 2 మిల్లీ లీటర్ల ప్రొఫెనోపాస్‌ను కలిపి పిచికారీ చేయాలి.



పెద్దవూరలో సాగవుతున్న కంది

ఎండు తెగులు

నేలలో తగినంత తేమ ఉన్నప్పటికీ కంది మొక్కలు నీటి ఎద్దడికి గురవుతున్నట్లుగా వడలిపోతుంటాయి. ఆకులు నిటారుగా ఉండక వాడిపోయినట్లుగా ఉంటాయి. ఆకులు పసుపు రంగుకు మారి వేలాడుతుంటాయి. పై కొమ్మ వద్ద ఎండటం ప్రారంభమై కింది కొమ్మ వరకు వ్యాపిస్తుంది. మొక్కలు ఎండిపోయినా ఆకులు మొక్కకు అతుక్కునే ఉంటాయి. తెగులు తొలి దశలో కాండం మీద బెరడును తొలగించి చూస్తే నలుపు చారలు కనిపిస్తాయి. తరువాత కాండం మొత్తం నల్లగా మారిపోతుంది. ఈ తెగులును ఆశించే బూజు శిలీంద్రం నేలలో ఎన్నో ఏళ్ల వరకు జీవించి ఉండి 3 మీటర్ల మేర వ్యాపిస్తుంది. ఇది ఉదజని సూచికను 4.6 నుంచి 9.0 వరకు నేలలో ఉష్ణోగ్రతను 35 సెంటిగ్రేడ్ వరకు తట్టుకోగలదు.

నివారణ

ఎండు తెగులును తట్టుకునే రకాలను సాగు చేసుకోవాలి. తెగులు ఎక్కువగా ఆశించే పొలాలను గమనించి పొగాకు లేదా జొన్న పంటలలో మార్పిడి చేసుకోవాలి. రెండు కిలోల ట్రైకోడెర్మా విరిడి ఫార్ములేషన్‌ను 100 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేప పండి కలిపి నీళ్లు చల్లి, బస్తాలో నీడలో ఉంచాలి. ప్రతి మూడు రోజులకు ఒకసారి నీళ్లు చల్లుతూ 10 రోజుల తరువాత ఆకు పచ్చని శిలీంద్రం కనిపించగానే ఈ ఎరువును ఒక ఎకరం పొలంలో చల్లాలి. కిలో విత్తనానికి 5 గ్రాముల ట్రైకోడెర్మావిరిడి ఫార్ములేషన్‌తో కలిపి విత్తన శుద్ధి చేసిన అనంతరం విత్తుకుంటే ఎండు తెగులు నుంచి పైరును కాపాడుకునే అవకాశం ఉంటుంది.

ఆకుచుట్టు పురుగు

కంది లేత దశలోనే తల్లి పురుగులు ఒక్కొక్క గుడ్డును ఆకుల ఈనెల పక్కన పెడతాయి. తొలి దశ లార్వాలు ఆకు పైపొరలను తొలిచి లోపలికి వెళ్లి గూడు చేసుకుని పెరుగుతాయి. తర్వాత దశ లార్వాలు తమ నోటి దారాలతో ఆకుల్ని దగ్గరకు చేర్చి మధ్యలో చేరి తమ నోటితో పత్రహరిత కణాలను గీకి వేసి పెరుగుతుంటాయి. ఆకు ముడతల్లో ప్యూపా దశకు చేరుతుంది. మొదటి దశలో ఏర్పడిన బొబ్బలు విస్తరించబడి ఆకులపై ఎండు మచ్చలు ఏర్పడతాయి. ఈ ఆకుముడత లక్షణం వల్ల ఆకులు ముడత పడటం, చుట్టుకుపోవడం, ఎండిపోవడం జరుగుతుంది.

నివారణ

వేప సంబంధిత మందుల ద్వారా నివారించవచ్చు. లీటరు నీటిలో 1.6మిల్లీ లీటర్ల మోనోక్రాటోఫాస్ ఏలదా 2 మిల్లీ లీటర్ల క్వినాల్‌ఫాస్‌ను కలిపి పిచికారీ చేయాలి.

పూత పురుగు (మారుకా మచ్చల పురుగు)

లేద ఆకులపై, పూతపైన గుడ్లు పెడతాయి. వీటి నుంచి వచ్చే లార్వాలు ఆకు, పూలు, పిందెలున్న మొక్క చివరన గూడు చేసుకుని లోపల చేరి ఆకులు, పూలు, మొగ్గలను తింటూ పెరుగుతాయి. ఈ లార్వాలు 13–18 రోజుల వ్యవధిలో గూడులోనే ప్యూపాలుగా మారి తిరిగి 5–7 రోజుల వ్యవధిలో తల్లి పురుగులుగా రూపాంతరం చెందుతాయి.

నివారణ

ఈ పురుగు ప్రారంభ దశలో ఎకరాకు 1 లీటరు వేప నూనెను పిచికారీ చేయడం వలన నివారించవచ్చు. ఒక లీటర్ నీటిలో మోనో క్రోటోఫాస్, డైక్లోర్‌వాస్ 1.6 మిల్లీ లీటర్లు కలిపి పిచికారీ చేసుకోవాలి. లేదా లీటరు నీటిలో క్లోరిఫైరిఫాస్, డైక్లోర్‌వాస్ 0.1 మిల్లీ లీటర్లు కలిపి పిచికారీ చేసుకోవాలి. ఒక మిల్లీ లీటర్ డైక్లోర్‌వాస్(నువాన్)ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవడం వలన పూతపురుగు బెడదను నివారించవచ్చు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి

- ద్విచక్ర వాహనాల వల్లే అధికంగా రోడ్డు ప్రమాదాలు
- మృతుల్లో హెల్మెట్ ధరించనివారే ఎక్కువ
- హెల్మెట్ ధరిస్తేనే ప్రాణాపాయం ఉండదంటున్న పోలీసులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : ద్విచక్ర వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్న వారి సంఖ్య జిల్లాలో నానాటికీ పెరిగిపోతోంది. ఇలాంటి ప్రమాదాల్లో మరణాలు సంభవిస్తున్న సంఘటనలు పరిశీలిస్తే హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపినవే అధికంగా కనిపిస్తున్నాయి. హెల్మెట్‌ను ధరించకుండా నిర్లక్ష్యం చేస్తూ చిన్నపాటి ప్రమాదాల్లో కూడా విలువైన ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు కొందరు. హెల్మెట్ ధరించి బైక్‌లు నడపడం ద్వారా కొన్ని సమయాల్లో పెద్ద ప్రమాదం జరిగినా సురక్షితంగా బయట పడవచ్చని పోలీసులు చెబుతున్నారు. హెల్మెంట్ ధరించడం వల్ల ప్రాణాపాయం తప్పనుందని అంటున్నారు.

పెరుగుతున్న ప్రమాదాలు

రోడ్డు ప్రమాదాలు అధిక శాతం ద్విచక్ర వాహనాల వల్లే సంభవిస్తున్నాయి. మృతుల్లో 45 శాతం మంది హెల్మెట్ ధరించని వారే ఉంటున్నారు. గ్రామీణ రహదారులపై అత్యధిక సంఘటనలు సంభవించినట్లు పోలీసులు గుర్తిస్తున్నారు. రహదారి భద్రత నిబంధనలు పాటించకపోవడమే దీనికంతటికి కారణమంటున్నారు. విద్యార్థులు, యువకులు వాహనాలపై దూకుడుగా ప్రయాణించకుండా జాగ్రత్తగా నడపాలని సూచిస్తున్నారు. తల్లిదండ్రులు కూడా కూడా పిల్లలకు బైక్‌లు ఇచ్చి ప్రమాదాలు కొనితెచ్చుకోవదని చెబుతున్నారు. అవగాహన కల్పిస్తూ.. కేసులు నమోదు చేస్తున్న కొందరు ద్విచక్ర వాహనదార్లలో మార్పు రావడం లేదని పోలీసులు అంటున్నారు.



తిరుమలగిరి మండలం మాలిపురం గ్రామానికి చెందిన వేముల దేవయ్య–మంగమ్మ దంపతుల ఇద్దరు కుమారులు నాగరాజు(26), కార్తీక్ (24) గురువారం రాత్రి తుంగతుర్తికి బైక్‌పై వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో తుంగతుర్తి మండలం బండరామారం క్రాస్‌రోడ్డు వద్ద బైక్ అదుపు తప్పి పడిపోవడంతో కార్తీకకు బలమైన గాయాలై అక్కడికక్కడే చనిపోయాడు. నాగరాజుకు తీవ్ర గాయాలు కావడంతో నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు. వీరిద్దరు హెల్మెట్ ధరించకపోవడం వల్లే బలమైన గాయాలై మృతిచెందినట్లు పోలీసులు నిర్ధారించారు.

ఏడాదిలో సూర్యాపేట జిల్లాల్లో ప్రమాదాలు ఇలా

ద్విచక్ర వాహన ప్రమాదాలు 209
మృతులు 81 క్షతగాత్రులు 196
హెల్మెట్ ధరించని వారిపై కేసులు 28,730

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ద్విచక్ర వాహనదారులు ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి. ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసి హెల్మెట్‌ను ధరించకపోవడం, రాంగ్ రూట్‌లోకి వెళ్లి ఎదురుగా వచ్చే వారిని ఢీకొనడం వంటి సంఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడిపితేనే ప్రాణాపాయం ఉండదు.

– నరసింహ, ఎస్పీ



హెల్మెట్ విషయంలో వీటిని గమనించండి..

- హెల్మెట్ ధర ఎక్కువ అని ఆలోచించకుండా తప్పనిసరిగా కొనుగోలు చేయాలి.
- నాసిరకం, ధర తక్కువవి కాకుండా ఐఎస్‌ఐ గుర్తుతో ఉన్న హెల్మెట్‌ను కొనడం మంచింది.
- మామూలు రకానికి, నాణ్యమైన వాటికి ధరలో వ్యత్యాసం రూ.500లోపే ఉంటుంది.
- హెల్మెట్‌ను బైక్‌ల అద్దానికో, వెనుక కొక్కానికో తగిలించడం సరికాదు.
- హెల్మెట్ ధరించాకే బండిని స్టార్ట్ చేయాలని గుర్తుంచుకోవాలి.
- కేవలం తలకు ధరించడం వల్ల ప్రయోజనం ఉండదు. మెడకింది భాగంలో క్లిప్పు పెట్టుకోవాలి.
- తనిఖీల నుంచి తప్పించుకోవడానికి, గాలి వీస్తుందనో టోపీ తరహా తేలిక వాటిని వినియోగిస్తే ఉపయోగం శూన్యం.

రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి



తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన గుండ్లపల్లి నరేష్ (34) బైక్‌పై తిరుమలగిరికి వస్తుండగా మాలిపురం క్రాస్‌రోడ్ సమీపంలో బైక్‌పై నుంచి పడడంతో తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తలకు హెల్మెట్ ఉంటే ప్రాణాపాయం తప్పేదని స్థానికులు పేర్కొన్నారు.